యథేచ్ఛగా ఆక్రమణలు

- ఏలూరు నగరంలో డ్రెయిన్లపైనే వ్యాపారాలు
- ఫిర్యాదులపై స్పందించని కార్పొరేషన్ అధికారులు
- స్థానికులకు ఇబ్బందులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో విలువైన స్థలాలపై ఆక్రమణదారుల చూపు పడింది. ఎవరి స్థాయిలో వారు ప్రజాప్రతినిధులతో మంతనాలు జరిపి వారికి తృణమో పణమో ముట్టజెప్పి అనంతరం దర్జాగా కబ్జా చేసేస్తున్నారు. అప్పటికప్పుడు ప్రభుత్వ స్థలాల్లో పక్కా నిర్మాణాలు చేపట్టేస్తున్నారు. వీటిపై అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడంటూ ఫిర్యాదుదారులు వాపోతున్నారు. నగరంలో యథేచ్ఛగా ఆక్రమణల పర్వం కొనసాగుతూనే ఉంది. ఇదంతా తెలిసినా అధికారులు ప్రజాప్రతినిధుల అండదండలు ఉన్న ఆక్రమణదారుల జోలికెళితే తమకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తుతాయనే ఉద్దేశంతో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మరో పక్క రద్దీ రోడ్లతో ఫుట్ పాత్‌లపైనే వ్యాపారాలు చేస్తుండడంతో రాకపోకలకు వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆక్రమణలు ఇలా..

ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని వైఎంహెచ్‌ఏ హాలు వెనుక ఉన్న పూలకొట్టు సందులో కార్పొరేషన్ ఖాళీ స్థలంపై ఓ ఆక్రమణదారుడి కన్ను పడింది. వెంటనే ఆ స్థలంలో కాంక్రీటుతో పిల్లర్లు వేసేసి, శ్లాబ్ వేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నిర్మాణంపై ఏఒక్క అధికారీ ప్రశ్నించడంలేదని స్థానికులు వాపోతున్నారు. 11వ డివిజన్ శనగపప్పు బజార్ నుంచి పోణంగి వెళ్లే ప్రధాన రహదారి మలుపు ప్రాంతంలో మార్జిన్ లేకుండా డ్రెయిన్‌పై కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. మలుపు కావడం ఎదురెదురుగా వచ్చే వాహనాలు కన్పించకపోవడంతో ఇక్కడ తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రద్దీగా ఉండే కుండీ సెంటర్ నుంచి గడియార స్తంభం సెంటర్, పెరుగు చెట్టు నుంచి మర్చంట్ చాంబర్ కల్యాణ మండపం వచ్చే మార్గం, శనగపప్పు బజారు నుంచి పోణంగి వెళ్లే మార్గం ఇలా అన్ని ప్రాంతాల్లో స్థలాలు ఆక్రమించుకుని వ్యాపారాలు చేసేస్తున్నారు. వీరికి స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలు పుష్కలంగా ఉండటం, అధికారులకు తమతమ స్థాయిల్లో ముడుపులు చెల్లించుకోవడం వల్లే డ్రెయినేజీపైనే నిర్మాణాలు చేపట్టినా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి.



వైఎంహెచ్‌ఏ హాలు వెనుక కార్పొరేషన్ స్థలంలో పక్కా నిర్మాణాలు



కార్పొరేషన్ స్థలంలో దర్జాగా కాంక్రీట్ పనులు



పోణంగి వెళ్లే మార్గంలో డ్రెయిన్‌పై నిర్మించిన గది

ఆక్రమణలు తొలగించాలి



ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో అనేక చోట్ల ఉన్న ఆక్రమణలను తొలగించాలి. వీటిపై కార్పొరేషన్ అధికారులకు ఇప్పటికే పలుమార్లు వినతులు అందజేశాం. అయినా ఒక్క ఆక్రమణను తొలగించలేదు. ఫిర్యాదు చేసిన ప్రతిసారి స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి బెదిరింపులు వస్తున్నాయే తప్ప సమస్య పరిష్కారం కావడం లేదు.

– ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, స్థానికుడు, వన్‌టౌన్, ఏలూరు

నిబంధనలు అమలు చేయాలి



వ్యాపారుల పట్ల నిబంధనలు పక్కాగా అమలు చేయాలి. కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టేటప్పుడే మార్జిన్ వదిలారా లేదా అనేది పరిశీలించాలి. స్థలాల ఆక్రమణదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. రాజకీయ అండదండలు ఉంటే ఒక విధంగా, సాధారణ ప్రజల పట్ల మరో విధంగా వ్యవహరించటం తగదు.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకులు, ఏలూరు

క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు సోమవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన రామనాథం ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచారి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌ఓ మాలిని

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులంతా ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆర్ మాలిని సూచించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం రిజర్వ్ పోలీసులైన్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. పిల్లలకు నులిపురుగు మాత్రలు ప్రతి సంవత్సరం వేయిస్తున్నామని మాలిని తెలిపారు. ముందుగా మాలిని, ప్రోగ్రాం అధికారి డాక్టర్ నరేంద్ర కృష్ణ పిల్లలకు టాబ్లెట్స్ వేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రగతి, జిల్లా మేనేజర్ నరేష్ బొప్పన, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పనుల తనిఖీ



రీసర్వేను తనిఖీ చేసిన ఆర్డీఓ అంబరీష్

దెందులూరు: భూ రీ సర్వే పనులు వేగవంతం కావాలని ఏలూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్ అన్నారు. సోమవారం దెందులూరు మండలం మలకచర్లలో జరుగుతున్న భూ రీసర్వే పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో మొత్తం పొలాలు ఎప్పటి వరకు రీసర్వే చేసే కార్యక్రమంలో రైతుల సహకారం తోపాటు ఇతర వివరాలు సిబ్బందిని ఆర్డీఓ అడిగి తెలుసుకున్నారు. దెందులూరు తహసీల్దార్ బి.సుమతి, మండల సర్వేయర్ రమణారావు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మూక పంచశతి పారాయణ



మూక పంచశతి పారాయణం నిర్వహిస్తున్న దుర్గా సప్తశతి బృందం సభ్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారం పేరయ్య కోనేరు ప్రాంగణంలో 93వ వార్షిక రామకోటి మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత కల్యాణం నిర్వహించారు. ప్రాంగణంలోని శ్రీరామ మందిరంలో ఉదయం 7 గంటలకు పునర్వసు నక్షత్రం పర్వదినం సందర్భంగా మూలవిరాట్‌లకు అభిషేకం చేశారు. స్వామివారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 4 గంటలకు నగరానికి చెందిన దుర్గా సప్తశతి బృందంచే పాదర్తి జ్యోతి ఆధ్వర్యంలో మూక పంచశతి పారాయణ నిర్వహించారు.

నేడు ప్రత్యేక వైద్య శిబిరం

ఏలూరు (టూటౌన్): అంతర్జాతీయ యునాని దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని యునాని వైద్యశాలలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రభుత్వ యునాని వైద్యశాల మెడికల్ ఆఫీసర్ జి.రఘునాథ్ తెలిపారు. శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు చేసి, మందులను ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. యునాని వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

సేవాభావంతో జీవించాలి



వేడుకలో మాట్లాడుతున్న బిషప్ పొలిమేర

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దేవుని ఆలయం ఎంతో పవిత్రమైనదని, విశ్వాసులంతా పవిత్ర హృదయాతో, పరిశుద్ధమైన సేవాభావంతో జీవించాలని ఏలూరు పీఠాధిపతి, విశాఖపట్నం అగ్రపీఠం అపోస్తలిక పాలనాధికారి బిషప్ జయరావు పొలిమేర సూచించారు. స్థానిక గ్జేవియర్ నగర్‌లోని అమలోద్భవి మాత కథీడ్రల్ చర్చి అమలోద్భవి కథీడ్రల్ విచారణకర్త ఫాదర్ ఇంజమాల మైఖేల్ ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలు, లూర్దుమాత పండుగల రెండో రోజు కార్యక్రమాలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేడకలో జయరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపినమార్గంలో పయనించాలన్నారు. ప్రత్యేక అతిథి శృంగవృక్షం విచారణకర్త ఫాదర్ తోట గాబ్రియేలు మాట్లాడుతూ దేవుని పట్ల నిండు విశ్వాసంతో జీవించి ధన్యులు కావాలని సూచించారు. అనంతరం బిషప్ జయరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు ఎస్ కృపానందం, కె.లీలారావు, టి.రామారావు, ఆర్ బెనర్జీ, ఎస్ థామస్, కేపీ ప్రసన్నరావు, జె.పీటర్, కార్పొరేటర్ నిర్మల, విశ్వాసులు పాల్గొన్నారు.

అచ్చమ్మ తల్లి సన్నిధిలో అబ్బయ్య చౌదరి, జేపీ



మాజీ ఎమ్మెల్యేను అబ్బయ్యచౌదరిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ

దెందులూరు: గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలు తల్లి సన్నిధికి దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ సోమవారం అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నారు. అబ్బయ్య చౌదరి, జయప్రకాష్‌కు ఆలయ కమిటీ ఆలయ ప్రధాన అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ప్రధాన అర్చకులు శర్మ ఇరువురికీ శేష వస్త్రం అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ అబ్బాయి చౌదరికి, జయప్రకాష్‌కు అమ్మవారి జ్ఞాపకను అందజేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి జ్ఞాపికను ఇరువురికి అందజేశారు. వీరి వెంట దెందులూరు ఏలూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



డీటీసీకి వినతిపత్రం సమర్పిస్తున్న పీఎస్ఎఫ్ఐ నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బస్సుల్లో సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తున్న జిల్లాలోని ధర్మాజీగూడెం హోలీ ట్రినిటీ స్కూల్, అనన్య స్కూల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పీఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు జీవన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యాసంస్థల యాజమాన్యాలు బస్సుల ఫీజు వేలకు వేలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి దోచుకుంటున్నారని, బస్సులో పిల్లలకు కూర్చోవడానికి కూడా లేకుండా ఒకరిపై ఒకరిని కుక్కేశారని తరలిస్తున్నట్లు తమ పరిశీలనలో తేలిందని వివరించారు. పిల్లల ప్రాణాల పట్ల బాధ్యత లేకుండా బస్సుల్లో ఓవర్ లోడ్ చేసి నడుపుతున్నారని తెలిపారు. కొన్ని బస్సులకు పర్మిషన్లు లేవని, మరికొన్ని బస్సులకు ఎఫ్సీలు కూడా డేట్ అయిపోయని వివరించారు. అధికారులు వెంటనే తనిఖీ చేసి కండిషన్ సరిగ్గా లేని బస్సులను సీజ్ చేయాలని, పరిమితి మేరకే బస్సులో పిల్లలను ఎక్కించుకునే విధంగా ఆయా స్కూళ్లకు నోటీసులు జారీ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అస్తవ్యస్తంగా కూటమి పాలన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నగరానికి చెందిన పి.లీలా నగేష్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన అస్తవ్యస్తంగా ఉందని ఆరోపించారు. కూటమి పార్టీలు ఎన్నికల మ్యానిఫెస్టోలో ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే డీఎస్సీ ఫైలుపై తొలి సంతకం 8 నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోకపోవడం చంద్రబాబు వైఫల్యమేనని వివరించారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇప్పుడు నిధులు లేవని మొసలికన్నీరు కార్చుతున్నారని ఎద్దేవా చేశారు. తనను గెలిపిస్తే శాసన మండలిలో సామాన్యుల వాణి వినిపిస్తానని, ప్రభుత్వంపై పోరాడి ఇచ్చిన మామీలన్నీ అమలు చేసేలా కృషి చేస్తానని తెలిపారు.

ఘంటసాల స్వర నీరాజనం



ఘంటసాల గీతం ఆలపిస్తున్న గాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సంగీతం ఉన్నంతకాలం ఘంటసాల ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉంటారని అతిథులు అన్నారు. ఘంటసాల 51వ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ఘంటసాల సంగీత కళాశాల విద్యార్థులచే స్వర నీరాజనం కార్యక్రమం నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ ఘంటసాల తెలుగు ప్రజలకు సంగీతం ద్వారా అమృతాన్ని పంచారన్నారు. ముఖ్య అతిథిగా బుద్దాల రామారావు, అతిథులుగా కేవీ సత్యనారాయణ, వేమా కోటేశ్వరరావు, వీవీ హనుమంతరావు, పెదపాటి రామకృష్ణ, పుల్లభొట్ల పురుషోత్తం పాల్గొన్నారు. ఘంటసాల సంగీత కళాశాల అధ్యక్షురాలు రేవతి రామ్ కుమార్, మనస్విని వారి శిష్య బృందం ఘంటసాల గీతాలను ఆలపించి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు.

ఈ- క్రాప్ నమోదు పరిశీలన



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

దెందులూరు: ప్రతి రైతు తప్పనిసరిగా తమ భూమిలో వేసే పంటల వివరాలను ఈ- క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి సూచించారు. పంట నష్టం, పథకాలు, పరిహారం అందుకునేందుకు ఈ- క్రాప్ నమోదు అర్హతగా ఉపయోగపడుతుందని తెలిపారు. సోమవారం మండలంలో చేపట్టే ఈ-క్రాప్ సూపర్ చెక్‌ను పోతునూరులో జేసీ పరిశీలించారు.

మార్కెటింగ్ వ్యూహాలపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న మురళీకృష్ణారావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రతి విద్యార్థీ తరగతి చదువుతో పాటు ఆయా పరిశ్రమల నిర్వాహకుల నుంచి తమకు కావాల్సిన విషయ పరిజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని పెంచుకోవాలని విశాఖపట్నం ఎంఎస్ఎంఈ సెంటర్ ప్రిన్సిపాల్ కె.మురళీకృష్ణారావు అన్నారు. స్థానిక సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ విభాగం, విశాఖపట్నం ఎంఎస్ఎంఈ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం డిజిటల్ మార్కెటింగ్ వ్యూహాలు, నైపుణ్యాలు అనే అంశంపై 5 రోజుల వర్క్‌షాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్ ప్రతిమ మాట్లాడుతూ ఇటీవల డిజిటల్ మార్కెటింగ్ వైపే ప్రపంచం నడుస్తోందన్నారు. పలు డిజిటల్ మార్కెటింగ్ వ్యూహాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు, హెచ్ఓడీ కేవీ శ్రీధర్, కో ఆర్డినేటర్స్ ఎన్ సతీష్, ఎన్ మోహన్ విఠల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని రుచిగా సిద్ధం చేయాలి



గుండుగొలనులో వండిన బిర్యానీని పరిశీలిస్తున్న డీఈఓ ఎం వెంకటలక్ష్మమ్మ

భీమడోలు: పరీక్షల వేళ మధ్యాహ్న భోజనాన్ని మరింత రుచి, శుచిగా తయారు చేయించే బాధ్యత సంబంధిత హెచ్ఎంలపై ఉందని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఎంఈవో అయినపర్తి భాస్కర్ కుమార్‌తో కలిసి ఆమె ఆకస్మికంగా సందర్శించారు. టెన్త్ ప్రీ పబ్లిక్ పరీక్షల నిర్వహణ, ఎండీఎం తయారీ, పరీక్షాపే చర్చ తదితర అంశాలను ఆమె పరిశీలించారు. వండిన బిర్యానీ, వంకాయ, టమాటా, ఉడకబెట్టిన కోడిగుడ్ల నాణ్యతను పరిశీలించి ఎండీఎం నిర్వాహకులకు పలు సూచనలందించారు. పాఠశాలకు హాజరైన ప్రతి విద్యార్థి భోజనం చేసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎండీఎంలో అలసత్వం వహిస్తే ఎండీఎం నిర్వాహకులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత తెలుగు టెన్త్ ప్రీ పబ్లిక్ పరీక్ష నిర్వహణను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలందించారు. పాఠశాలలోని 155 మంది పరీక్షలు రాస్తున్నాయని డీఈవోకు హెచ్ఎం గారపాటి కనకదుర్గ సునీత వివరించారు. డీఈవో మాట్లాడుతూ పరీక్షలంటే భయపడవద్దని, ఒత్తిడిని జయిస్తే లక్ష్యాన్ని సాధించడం సులువేనని అన్నారు. టెన్త్ క్లాస్ జీవితానికి మలుపు అని, నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు తెలిపారు. అనంతరం చిన్నారులు, టీచర్లతో కలిసి ఆమె పరీక్షా పే చర్చలో పాల్గొని నరేంద్రమోడీ ప్రసంగాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అయినపర్తి భాస్కర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ప్రశాంతి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ భవనంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీకృష్ణ ఆస్పత్రి డాక్టర్ బి.కృష్ణ, సిబ్బంది దాదాపు 100 మందికి పైగా అసోసియేషన్ సభ్యులకు సేవలు అందించారు. బీపీ, షుగర్ పరీక్షలు, మోకాళ్లు, ఇతర శారీరక నొప్పులకు చికిత్సలు చేసి, అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు దున్నా వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎస్ఎస్ఆర్ సత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు.

ర్యాగింగ్ జోలికి వెళ్లొద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దెందులూరు: ర్యాగింగ్ జోలికి ఏ ఒక్కరూ వెళ్లొద్దని ఏలూరు పీఠం వికార్ జనరల్ సెయింట్ జోసెఫ్ విద్యాసంస్థల ప్రిన్సిపల్ డాక్టర్ ఫాదర్ పి.బాల అన్నారు. సోమవారం సోమవరప్పాడు సెయింట్ జాన్స్ విద్యా సంస్థల్లో యాంటీ ర్యాగింగ్ డే సమావేశం అనంతరం ర్యాలీ నిర్వహించారు. వికార్ జనరల్ ఫాదర్ బాల జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ప్రభుత్వ ర్యాగింగ్‌కు పాల్పడిన, సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతి కళాశాల విద్యాసంస్థల్లో సీసీ కెమెరాలు ఇటువంటి కార్యక్రమాలను చిత్రీకరించేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	16
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	25
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	27
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	29
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	31
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	12	చిక్కుడు కాయలు	36
వంకాయలు (కాంతులు)	24	బిళ్లచిక్కుడు	48
వంకాయలు (తెలుపు)	20	చామదుంపలు	44
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	26	కంద	72
కాకర కాయలు	32-44	బీట్‌రూట్	32
బీరకాయలు	00	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	60
క్యాబేజీ	16	అల్లం	50
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	30	పాలకూర	10
బంగాళదుంపలు	30	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	28	గోంగూర	07-10
దోసకాయలు	24-36	పుదీనా	05
ఆనపకాయ (1)	20-25	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40